# ఫీజు రీయింబర్స్ మెంట్ పథకం ఎత్తివేస్తే సహించేది లేదు


## రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి హెచ్చరిక



**పిడికిలి/మహేశ్వరం, ఏప్రిల్ 21:** ఫీజు రీయింబర్స్ మెంట్ పథకం ఎత్తి వేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు ఉన్నదని, అందుకే ఫీజు రీయింబర్స్ మెంట్ ఇవ్వడం లేదని మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. ఒక పేద ఇంజనీరింగ్ విద్యార్థి హాల్ టికెట్ ఇవ్వలేదని ఆత్మహత్య చేసుకుంటే కూడా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని ఆమె మండిపడ్డారు. సిఎం విద్య, మున్సిపల్ శాఖలను చూస్తున్న ఏమి ప్రయోజనం లేదన్నారు. విద్యార్థులు మృతి చెందిన స్పందించరు, దోమల బాధ భరించలేకపోతున్నామన్న నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రజాపాలన పేరుతో ప్రచారం తప్ప ప్రజలకు ఓరగబెట్టింది ఏమి లేదని సబితా ఇంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయంలో బడంగ్ పేట్ ప్రధాన రహదారికి ఇరువైపుల కూల్చి వేతలు, పలు అభివృద్ధి పనులపై సర్కిల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బడంగ్‌పేట్ పరిధిలో జరుగుతున్న అక్రమ కూల్చివేతలపై, ముఖ్యంగా ఫుట్‌పాత్‌ల తొలగింపులపై ఎమ్మెల్యే అధికారులను వివరణ కోరారు. త్రాగు నీరు, శానిటేషన్, వీధి దీపాల, సమస్యలను అడగడంతో పాటు టెండర్లు ఖరారై ఇప్పటికి ప్రారంభానికి నోచుకోని పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూల్చి వేతలతో ప్రజలను ఇబ్బందులకు గురి చేయవద్దని చెప్పారు. రోడ్డు విస్తరణ ఎక్కడి వరకు వస్తుందో ముందుగానే బాధితులకు చెప్పి, మార్కింగ్ చేసి, వారికి నష్టపరిహారం (టిడిఆర్) ఇచ్చిన తరువాత కూల్చి వేతలు చేపట్టాలని సూచించారు. అదే విధంగా పెండింగ్‌లో ఉన్న పనులన్ని త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశం అనంతరం సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో బడంగ్ పేట్ సర్కిల్ పరిధిలో పలు రోడ్ల విస్తరణ కోసం రూ.168 కోట్లు మంజూరు అయినట్లు చెప్పారు. త్వరగా టెండర్లు పూర్తి చేసి, పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. అదే విధంగా జిహెచ్ఎంసి నుంచి మరి కొన్ని రోడ్లు వేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు చెప్పినట్లు చెప్పారు. ముఖ్యంగా బాలాపూర్ సర్కిల్ నుంచి ఆదిభట్ల వరకు ఒక రోడ్డు, జిల్లెల గూడ అంబేద్కర్ విగ్రహం నుంచి బడంగ్ పేట్ వరకు గల రోడ్ల తో పాటు మరి కొన్ని రోడ్ల విస్తరణకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రజాపాలన పేరుతో ప్రచారం చేసుకోవడం తప్ప ప్రజలకు ఓరగబెట్టింది ఏం లేదని విమర్శించారు. 99 రోజుల ప్రజా పాలన పట్టణ ప్రణాళిక లో ఏమి చేస్తున్నారని నిలదీశారు. దోమలు విపరీతంగా పెరిగి ప్రజలు కంటిమీద కునుకు లేకుండా బాధపడుతున్నారని అన్నారు. ఈ ప్రభుత్వానికి విద్యార్థులు మృతిచెందిన ప్రజలు ఇబ్బందులు పడుతున్న నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రజా పాలనలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు తప్ప, ప్రయోజనం ఏం లేదని విమర్శించారు. పేద మధ్య తరగతి పిల్లలు చదువుకొని ఉన్నత స్థితికి రావాలని సంకల్పంతో దివంగత నేత వైయస్సార్ ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని తీసుకు వస్తే దానిని మాజీ సీఎం కేసీఆర్ గొప్ప మనస్సుతో కొనసాగించారని గుర్తు చేశారు కానీ ఈ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు ఇవ్వకుండా విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వ్యవహారం చూస్తుంటే ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని ఎత్తివేయడానికి చూస్తున్నట్లు ఉన్నదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యార్థులకు భరోసా ఇచ్చి, కళాశాలలకు ఫీజు రీయింబర్స్ మెంట్ ఇస్తామని హామీ ఇచ్చి సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య గారు, డిఈ, ఏఈ, టౌన్ ప్లానింగ్ అధికారులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణకు రేగుల గండి చెరువు వద్ద ఇనుపకంచే ఏర్పాటు చేయాలి

## సామాజిక సేవ నాయకులు,కర్నే బాబురావు



**తెలంగాణ ఏప్రిల్ 21(పిడికిలి) :** మణుగూరు మండలంలోని కూనవరం పంచాయతీ పరిధిలోని గల, (బాంబే కాలనీ) రేగుల గండి చెరువు, వద్ద ప్రమాదాల నివారణకు చుట్టూ ఇనుప కంచే నిర్మించాలని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పాఠశాలలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని బాబురావు, కోరుతూ మణుగూరుకు చెందిన సామాజిక సేవకులు కర్నే బాబురావు జిల్లా కలెక్టర్ అంకిత్‌కి భద్రాచలం, ఐటిడిఏ, పిఓ, బి.రాహుల్, కి మంగళవారం వినతి పత్రాలు అందజేసినట్లు విలేకరులకు తెలిపారు, గత మూడు రోజుల క్రితం బాంబే కాలనీ, రేగుల గండి చెరువు,లో ప్రమాదవశాత్తు చనిపోయిన విద్యార్థి నక్క హర్షవర్ధన్ మృతి కన్నవారికి గర్భశోకాని మిగిల్చిందని ఆయన ఆవేదన చెందారు. ఈ సంఘటన తనను ఎంతగానో కలచివేసిందని తన వంతు కర్తవ్యంగా సమస్యను అధికారులు దృష్టికి తీసుకుని వెళ్ళినట్లు ఆయన తెలిపారు. హర్షవర్ధన్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రభుత్వాధికారులు తక్షణమే స్పందించి ఇనుపకంచెను ఏర్పాటు చేసి, అవసరమైతే అక్కడ ఒక వాచ్మెన్ కూడా నియమించాలని కర్నే బాబురావు అన్నారు.

# ఉద్యోగ విరమణ సన్మానోత్సవ అభినందన వేడుక

## ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**తెలంగాణ ఏప్రిల్ 21(పిడికిలి) :** పినపాక మండల పరిధిలోని ఏడుళ్ల బయ్యారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సేవలందించిన కంది తిరుపతి రెడ్డి ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా ఘనంగా సన్మానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పినపాక నియోజకవర్గం శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ, కంది తిరుపతి రెడ్డి సేవలను కొనియాడుతూ. విద్యా రంగంలో తిరుపతి రెడ్డి చేసిన కృషి, విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో చూపిన అంకితభావం ఆదర్శనీయమని ఎమ్మెల్యే, ప్రశంసించారు. ఈ సందర్భంగా కంది తిరుపతి రెడ్డి ,ని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా వీడ్కోలు పలికారు. ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొని వారి సేవలను స్మరించుకున్నారు. అందరూ కలిసి కంది తిరుపతి రెడ్డికి ఆరోగ్యకరమైన, ఆనందభరితమైన విశ్రాంతి జీవితం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కంది తిరుపతి రెడ్డి కుటుంబ సభ్యులు, పాఠశాల అధ్యాపకులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ అంగన్వాడీలు

## బొంతపల్లిలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



**గుమ్మడిదల, ఏప్రిల్ 21(పిడికిలి) :** కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా ప్రభుత్వ అంగన్వాడీ కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నామని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిమ్ముల సంధ్య గోవర్ధన్ రెడ్డి తెలిపారు. మున్సిపల్ పరిధిలోని బొంతపల్లి అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ టీచర్ల ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చైర్మన్ సంధ్య గోవర్ధన్ రెడ్డి చిన్నారుల ప్రదర్శనలను వీక్షించి అభినందించారు. ప్రత్యేక వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చిన్నారులకు ప్రీ-స్కూల్ దశలోనే నాణ్యమైన విద్య అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు గ్రాడ్యుయేషన్ వేడుకలు దోహదపడతాయని తెలిపారు. అంగన్వాడీల ద్వారా చిన్నారుల బౌద్ధిక, సామాజిక అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వ విద్యపై నమ్మకం పెంపొందించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. అంగన్వాడీ టీచర్ల సేవలను ఆమె అభినందించారు. తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై చిన్నారుల ప్రతిభను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు గిద్దె విజయలక్ష్మి, సురభి కుమార్ గౌడ్, శ్రీచూర్ణం చక్రపాణి, నాయకులు సురభి నాగేందర్ గౌడ్, ఆలేటి శ్రీనివాస్ రెడ్డి, చప్పటి మహేష్, రమేష్, అంగన్వాడీ సూపర్వైజర్ కవిత, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కాంగ్రెస్ కమిటీలో ఎన్నికైన వారిని సన్మానించి అభినందనలు

## ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు



**తెలంగాణ ఏప్రిల్ 21(పిడికిలి) :** దుమ్ముగూడెం మండలం, లక్ష్మీ నగరం గ్రామం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ కమిటీ పదవులలో ఎన్నికైన వారి సన్మాన సభ కార్యక్రమంలో పాల్గొన్న భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా పిలక వెంకట్రామిరెడ్డి,ని, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శులుగా లంకా శ్రీనివాసు (అబ్బులు) ని, సీరపు అప్పల రెడ్డి,ని, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్య నిర్వాహక సభ్యుడిగా గుర్రం వీరభద్రం ని, సయ్యద్ మున్నా, ఎన్నికైన సందర్భంగా శాలువాతో సత్కరించి వారికి అభినందనలు తెలియజేసిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి వీరందరూ కష్టపడి పనిచేసి, మరోసారి రాష్ట్రంలో కాంగ్రెస్ జెండా ఎగరవేసే విధంగా పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఇన్చార్జి ఎండి నవాబ్, మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి అక్రమ కట్టడాలు చేపడితే సహించేది లేదు

## కాంగ్రెస్ నేత బోయపల్లి రాఘవేందర్ రెడ్డి



**పిడికిలి/మహేశ్వరం, ఏప్రిల్ 21:** ప్రజా శ్రేయస్సు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రోడ్ల మాస్టర్ ప్లాన్ నిబంధనలను అతిక్రమించి, అక్రమ కట్టడాలు చేపడితే ఎంతటి వారైనా సహించేది లేదని ఏఐసిసి విచార్ విభాగ్ కో ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. అల్మాస్ గూడ - గుర్రం గూడ ప్రధాన రహదారి టెలికామ్ కాలనీ, న్యూ తిరుమల నగర్ మధ్య ఉన్న 100 ఫీట్ల మాస్టర్ ప్లాన్ రోడ్డు స్థలాన్ని ఆక్రమించి నిర్మిస్తున్న భవనంపై జిహెచ్ఎంసి అధికారులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. మాస్టర్ ప్లాన్ రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం మూలంగా భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ఈ అక్రమ నిర్మాణంపై గతంలో ఫిర్యాదు చేసినా, నిబంధనలను బేఖాతరు చేస్తూ, మళ్లీ పనులు మొదలుపెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేలా ప్రవర్తిస్తూ, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై అధికారులు కఠినంగా వ్యవహరించాలన్నారు. అక్రమ నిర్మాణ అనుమతులను తక్షణమే రద్దు చేసి, అక్రమ కట్టడాన్ని నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజల సౌకర్యార్థం రోడ్డు విస్తరణ పనులు సజావుగా సాగేలా చూడటమే మా లక్ష్యం అన్నారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంలో కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని రాఘవేందర్ రెడ్డి స్పష్టం చేశారు. అధికారులు తక్షణమే స్పందించి వంద ఫీట్ల రోడ్డుకు నిర్మిస్తున్న అక్రమ భవన నిర్మాణాన్ని ఆడుకోవాలని కోరారు.

# నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల ను ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు



**తెలంగాణ ఏప్రిల్ 21(పిడికిలి) :** దుమ్ముగూడెం మండలంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న భద్రాచలం నియోజకవర్గం శాసనసభ్యులు, డాక్టర్ తెల్లం వెంకట్రావు,ఈ సందర్భంగా గుంట పద్మ, చిలగంజి తులసి ఇందిరమ్మ ఇల్లులు గృహప్రవేశం లో వారి కుటుంబ సభ్యులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇల్లు ప్రతి పేదవారు లబ్ధి పొందాలని తెలిపారు. పేదలు ఇల్లు నిర్మించుకునే కల నెరవేరుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే కు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు .అనంతరం ఇందిరమ్మ గృహ లబ్ధిదారుల కుటుంబ సభ్యులు కలిసి ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఇన్చార్జి ఎండి నవాబ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# రామకృష్ణ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి





**పిడికిలి/మహేశ్వరం, ఏప్రిల్ 21:** గత వారం రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్న బీజేపీ బడంగ్ పేట్ సెక్టార్ వన్ అధ్యక్షుడు రాళ్లగూడెం రామకృష్ణ రెడ్డి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి పరామర్శించి, ఓదార్చారు. మంగళవారం సబితా ఇంద్రారెడ్డి బడంగ్ పేట్ లోని రామకృష్ణ రెడ్డి నివాసానికి వెళ్లి ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం తల్లిదండ్రులు, భార్య, ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. రామకృష్ణ రెడ్డి ఆత్మహత్య చేసుకోవాల్సింది కాదన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. సబితా ఇంద్రారెడ్డి తో పాటు స్థానిక నాయకులు, గ్రామ వాసులు నివాళులు అర్పించారు.

# అమీన్‌పూర్‌లో ఎస్‌టీపీ తరలింపు నిర్ణయానికి జిఎంఆర్ కు కృతజ్ఞతలు తెలిపిన అమీన్పూర్ పీపుల్స్ అసోసియేషన్ సభ్యులు




**అమీన్పూర్, ఏప్రిల్ 21 (పిడికిలి) :** అమీన్‌పూర్ ప్రాంత ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, నివాస ప్రాంతాల నుంచి సెవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ)ను తరలించేందుకు తీసుకున్న నిర్ణయంపై అమీన్‌పూర్ పీపుల్స్ అసోసియేషన్ తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల తిరుమల రెడ్డి తెలిపారు. నివాస ప్రాంత ప్రజల ఆందోళనలు గుర్తించి, వాటికి సానుకూలంగా స్పందిస్తూ ప్రజల ఆరోగ్యం మరియు పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఎస్‌టీపీని మార్చే చర్యలు తీసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇస్తూ, సమాజ హితాన్ని ముందుంచే ఎమ్మెల్యే గారి కట్టుబాటు ప్రశంసనీయం అని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాగే ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు.

# వంపుగూడలో చలివేంద్రం ప్రారంభం


## వేసవి వేడిని తగ్గించే దిశగా ప్రజలకు తాగునీటి సౌకర్యం

## ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి




**తెలంగాణ ఏప్రిల్ 21(పిడికిలి) :** వేసవి తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు వంపుగూడ కాలనీ కమ్యూనిటీ హాల్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభిం చారు. ఈ కార్యక్రమాన్ని రాయగట్ల కృష్ణ కిట్టు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మండుతున్న ఎండల్లో పాదచారులు, కార్మికులు, సాధారణ ప్రజలకు తాగునీరు అందించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. చలివేంద్రం ఏర్పాటు చేయడం ద్వారా అనేకమంది దాహం తీర్చుకుని ఉపశమనం పొందగలరని తెలిపారు. సమాజ సేవలో భాగంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నవీన్ గౌడ్, భద్రుద్దీన్ మల్లారెడ్డి, గణేష్ కృష్ణ గౌడ్ తదితర నాయకులు, కాలనీ వాసులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అయిలా పండరినాథ్ అవార్డు అందుకున్న మోహన్ బైరాగి






**తెలంగాణ ఏప్రిల్ 21(పిడికిలి) :** అభినందన కల్చరల్ సొసైటీ, పెంబర్తి జనగామ జిల్లా అయిలా పండరినాథ్ స్మారక అవార్డును తెలంగాణ ఉద్యమకారుడు, కవి, రచయిత, సీనియర్ జర్నలిస్ట్ మోహన్ బైరాగి అందుకు న్నారు. ఆదివారం జనగామ జిల్లా కేంద్రంలో జనగామ కవులు కళాకారుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్య, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి, శ్రీమతి నెల్లుట్ల రమాదేవి,డాక్టర్ మాచర్ల బిక్షపతి, రవీందర్ రావు,హైకోర్టు న్యాయవాది సాదిక్ అలీ, అయిలా సోమనర్సిమ చారి తదితరులు కవి, రచయిత, సీనియర్ జర్నలిస్ట్ మోహన్ బైరాగి కి అవార్డును అందజేశారు ఈ సందర్భంగా వక్తలు ప్రసంగిస్తు తెలంగాణ ఉద్యమ సాహిత్య యోధుడు తెలంగాణ రాష్ట్ర సాధనలో కళ, సాహిత్యం, ప్రజా ఉద్యమాలతో అనుబంధం కలిగిన వ్యక్తులలో ఒకరు మోహన్ బైరాగి అని అన్నారు. 1976 జనవరి 15న ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని అంతప్పగూడ గ్రామం కమ్మరి శంకరమ్మ, సంగమేశ్వరచారి రెండవ సంతానంగా ,హైదరాబాద్ కూకట్‌పల్లిలో పుట్టి పెరిగారని అన్నారు జి. కృష్ణ మాట్లాడుతూ భార్య పద్మ, కొడుకు వెంకట్, కూతురు వెన్నెలతో హైదరాబాద్ కూకట్పల్లి లో ఉంటున్న మోహన్ బైరాగి 1996 నుండి ప్రజా ఉద్యమాల్లో, ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో చురుకుగా పాల్గొన్నారని,తెలంగాణ అస్తిత్వం, అమరవీరుల గాథలు, ప్రజా సమస్యలు, ఆస్తిత్వ వాద పోరాటాలు ఇవన్నీ ఆయన రచనల్లో ప్రధాన ఇతివృత్తాలుగా నిలిచాయని తెలిపారు.సాహిత్య ప్రస్థానం 1998లో ప్రారంభమైందని, అప్పటి నుండి అమరవీరులపై, తెలంగాణ ఉద్యమంపై, సామాజిక అంశాల పై ఇప్పటి వరకు సుమారు 70 పాటలు 30 కవితలు రచించారు.మలి దశ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలకంగా పని చేశారని, కొన్ని నెలల పాటు జైలు జీవితం గడపడం జరిగిందని తెలిపారు.అయిలా సోమ నర్సింహా చారి మాట్లాడుతు మోహన్ బైరాగి రచనలు సామాజిక, ఉద్యమ ప్రేరణతో కూడిన స్వభావాన్ని తెలియజేస్తున్నాయని, ఆయన రచనలు ప్రధానంగా ఉద్యమ వేదికలు, సభలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పలువురు గాయకులు గానం చేశారని అన్నారు.ఆయన సాహిత్యంపై ప్రభావం చూపిన కవులు, రచయితలలో శ్రీశ్రీ, గద్దర్, వంగపండు, గోరటి వెంకన్న, మిత్ర, అసుర వంటి ప్రగతిశీల, ప్రజా సాహిత్య దిగ్గజాలు ఉన్నారని, మోహన్ బైరాగి రచనల్లో పోరాటస్ఫూర్తి, జనవాద దృక్పథం స్పష్టంగా కనిపిస్తాయని తెలిపారు.డాక్టర్ మాచర్ల బిక్షపతి మాట్లాడుతు.. అంతప్ప గూడ చంద్రమోహన్ ప్రజా ఉద్యమ సాహిత్యంలో మోహన్ బైరాగి పేరుతో అనేక రచనలు చేశారనితెలంగాణ రాష్ట్ర సాధన తర్వాత కూడా ఆయన క్రియాశీలకంగా ఉన్నారని అన్నారు.అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య (రాజఖీ) రాష్ట్ర అధ్యక్షుడిగా, తెలంగాణ సినిమా వేదిక ప్రధాన కార్యదర్శిగా , కీలక పాత్ర పోషిస్తున్నారని,ఉద్యమ కళాకారుల హక్కులు, పెన్షన్లు, ఉద్యోగాలు, సౌకర్యాల కోసం ధర్నాలు, పోరాటాల్లో చురుకుగా పాల్గొంటు. త్యాగాల తెలంగాణను గుర్తుచేస్తూ, ఉద్యమ స్ఫూర్తిని కాపాడుతూ ఆయన నిరంతరం పోరాడుతున్నారు.మోహన్ బైరాగి ఒక కవి మాత్రమే కాదు ప్రజా ఉద్యమ యోధుడు, సాంస్కృతిక కార్యకర్త, జర్నలిస్ట్. తెలంగాణ అస్తిత్వాన్ని పాటలు, కవితల ద్వారా బలోపేతం చేసిన ఆయన రచనలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని తెలిపారు.ఆయన సాహిత్యం జనజీవనంలో భాగమైందని తెలంగాణ సాధనలో ఆయన వంటి కళాకారుల కృషి ఎన్నటికీ మరచిపోలేనిదని అన్నారు.అవార్డు గ్రహీత మోహన్ బైరాగి మాట్లాడుతూ ఈ అవారు తన పై మరింత బాధ్యత పెంచిందని,అభినందన కల్చరల్ సొసైటీ, పెంబర్తి వారికి, జనగామ కవులు కళాకారుల ఐక్య వేదిక వారికి ధన్యవాదాలు తెలియజేసారు.

# ఘనంగా ఆదిశంకర జయంతి ఉత్సవాలు

## ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**తెలంగాణ ఏప్రిల్ 21(పిడికిలి) :** వైశాఖ శుద్ధ పంచమి సందర్భంగా జగద్గురు శ్రీ ఆదిశంకర భగవత్పాదుల జయంతి వేడుకలు మీర్పేట్ హౌజింగ్ బోర్డు ఫేజ్-1 చౌరస్తాలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహి ంచారు. ఈ కార్యక్రమాన్ని నిర్వాహకులు ధనుంజయ్ ఆధ్వర్యంలో విశేషంగా చేపట్టారు. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిశంకరాచార్యుల ఆధ్యాత్మిక బోధనలు సమాజానికి మార్గదర్శకాలని, యువత వాటిని ఆచరణలో పెట్టాలని సూచించారు. విశిష్ఠ అతిథులుగా మాజీ కార్పొరేటర్లు జేరిపోతుల ప్రభుదాస్, గుండారపు శ్రీనివాస్ రెడ్డి, గొల్లూరి అంజయ్య పాల్గొని ఆదిశంకరాచార్యుల సేవలను స్మరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి భావంతో పూజలు నిర్వహించారు. ఉత్సవం ఆధ్యాత్మిక వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

